ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



నంద్యాల

జిల్లా వార్తలు 5

సోమవారం 5 ఆగస్టు 2024

కోల్డ్‌వార్...!

డీసీఎంఎస్, మార్క్‌ఫెడ్ మధ్య సమన్వయలోపం

- నలిగిపోతున్న రైతులు
- సీజన్‌లో ఎరువులు ఇవ్వకుంటే ఎలా అంటున్న రైతులు
- క్యాష్ అండ్ క్యారీ పద్ధతిలో ఎరువులిస్తామంటున్న మార్క్‌ఫెడ్ అధికారులు
- బకాయిలు చెల్లించాలని డీసీఎంఎస్ పట్టు

కర్నూలు(అగ్రికల్చర్), ఆగస్టు 4: ఉమ్మడి కర్నూలు జిల్లాలో రైతులకు సకాలంలో ఎరువులను అందించే విషయంలో డీసీఎంఎస్, మార్క్‌ఫెడ్ సంస్థల మధ్య కోల్డ్‌వార్ జరుగుతోంది. ఉమ్మడి జిల్లాలో 17 డీసీఎంఎస్ కేంద్రాలున్నాయి. మార్క్‌ఫెడ్ సంస్థ ఈ కేంద్రాల ద్వారా ఏటా రైతులకు అవసరమైన ఎరువులను అందజేస్తోంది. అదే విధంగా పంట ఉత్పత్తులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు కొనుగోలు చేస్తోంది. అయితే గతంలో ఎన్నడూ లేని సంక్షోభం ప్రస్తుతం ఈ రెండు సంస్థల మధ్య తలెత్తింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు క్యాష్ అండ్ క్యారీ పద్ధతిలో డబ్బులు చెల్లిస్తేనే ఎరువులు ఇస్తామంటూ మార్క్‌ఫెడ్ అధికారులు భీష్మించుకొని కూర్చున్నారు. మరోవైపు డీసీఎంఎస్ అధికారులు తమకు గత నాలుగైదు సంవత్సరాలుగా ఎరువులను విక్రయించినందుకు కమిషన్ రూపంలో రావాల్సిన మొత్తంతో పాటు పంట ఉత్పత్తులను రైతుల నుంచి సేకరించినందుకు రావాల్సిన కమిషన్ మొత్తం దాదాపు రూ.కోటిన్నర దాకా మార్క్‌ఫెడ్ సంస్థ నుంచి రావాల్సి ఉందని, అయితే.. ఈ మొత్తాన్ని తమకు అందివ్వడంలో మార్క్‌ఫెడ్ ఉన్నతాధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారని డీసీఎంఎస్ అధికారులు చెబుతున్నారు. రాష్ట్ర ఉన్నతాధికారుల నుంచి ఈ మొత్తాన్ని రాబట్టుకోవాలని, తాము మాత్రం క్యాష్ అండ్ క్యారీ పద్ధతుల్లోనే ఎరువులను సప్లయ్ చేస్తామని మార్క్‌ఫెడ్ అధికారులు స్పష్టం చేస్తుండటంతో డీసీఎంఎస్ కేంద్రాల్లోని సిబ్బంది ఎరువులు రైతులకు సప్లయ్ చేయలేక తలపట్టు కూర్చున్నారు. కర్నూలు, డోన్, ఆత్మకూరు, పత్తికొండ, ఆదోని, ఎమ్మిగనూరు, నందికొట్కూరు, బనగానపల్లె, ప్యాపిలి, తదితర 17 చోట్ల డీసీఎంఎస్ కేంద్రాల్లో ఎరువులు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



మార్క్‌ఫెడ్ కార్యాలయం



కర్నూలులోని డీసీఎంఎస్ కార్యాలయం

రైతుల ఆక్రందనలు

గతంలో డీసీఎంఎస్ కేంద్రాల ద్వారా రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సిబ్బంది ఎరువులను సప్లయ్ చేసేవారు. ప్రైవేటు డీలర్ల వద్ద బస్తా ఎరువుపై రూ.50 నుంచి రూ.100 అధికంగా చెల్లించి రైతులు ఎరువులను కొనుగోలు చేయాల్సి వచ్చేది. డీసీఎంఎస్ కేంద్రాల్లో ప్రభుత్వం నిర్ణయించిన ధరకే ఎరువులను రైతులకు విక్రయిస్తున్నారు. అందువల్ల ఏటా ఖరీఫ్, రబీ సీజన్లలో దాదాపు వందల టన్నుల యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులను రైతులు కొనుగోలు చేసి పంటల సాగుకు వినియోగించారు. తాజా పరిణామంతో మార్క్‌ఫెడ్ సంస్థ డీసీఎంఎస్ కేంద్రాలకు ఎరువులను సప్లయ్ చేయకపోవడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. ఇదే అదునుగా ప్రైవేటు డీలర్లు ఎరువులపై రూ.50 నుంచి రూ.100లు అధికంగా వసూలు చేసుకుంటున్నారు.

మా మొర ఆలకించరా...!

మార్క్‌ఫెడ్ అధికారుల తీరుపై రైతుల ధ్వజం

గత నాలుగైదు సంవత్సరాలుగా పంట ఉత్పత్తుల కొనుగోళ్లు, ఎరువుల అమ్మకాలు చేపట్టినందుకు డీసీఎంఎస్ సంస్థకు మార్క్‌ఫెడ్ సంస్థ అధికారులు రూ.కోటిన్నర దాకా చెల్లించాల్సి ఉంది. జీతభత్యాలు, కార్యాలయాల అద్దెలు, కరెంటు చార్జీలు, తదితర మెయింటెనెన్స్ ఖర్చులు భరించాలన్నా మార్క్‌ఫెడ్ సంస్థ కమిషన్ రూపేణా ఇచ్చే డబ్బులే తమకు ఆధారం అని డీసీఎంఎస్ అధికారులు స్పష్టం చేస్తున్నారు. మార్క్‌ఫెడ్ సంస్థ ఎప్పటికప్పుడు కమీషన్‌గా ఇవ్వాల్సిన డబ్బులను ఇవ్వకపోవడం వల్ల జీతాలు చెల్లించాల్సిన పరిస్థితి మరో రెండు నెలల్లో తలెత్తే ప్రమాదం ఉందని అధికారులు ఆందోళన చెందుతున్నారు. రైతులకు సీజన్‌లో ఎరువులు ఇవ్వకుంటే మార్క్‌ఫెడ్ సంస్థతో పాటు ప్రభుత్వంపై కూడా రైతులు నిరసన గళం వినిపించే పరిస్థితులు నెలకొంటున్నాయి. అందువల్ల డీసీఎంఎస్ సంస్థకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే ఇస్తే వారు ఎరువుల సప్లయ్‌కి డబ్బులను వెంటనే చెల్లించే అవకాశం ఉంటుందని రైతులు చెబుతున్నారు.

ఎరువులను సప్లయ్ చేస్తాం : నాగరాజు, మార్క్‌ఫెడ్ డీఎం



ఉమ్మడి కర్నూలు జిల్లాలో డీసీఎంఎస్ కేంద్రాలకు ఎరువులను సకాలంలో అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాము. ఆ సంస్థకు చెల్లించాల్సిన మొత్తాన్ని రాబట్టుకునేందుకు డీసీఎంఎస్ అధికారులు రాష్ట్ర అధికారులను సంప్రదించాలి. ఆ డబ్బులు చెల్లించే అధికారం తమ పరిధిలో లేదు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఎరువులను ఎటువంటి ఆటంకాలు లేకుండా సప్లయ్ చేస్తాము.

డీసీఎంఎస్ కేంద్రాలకు ఎరువులను ఇవ్వాలి : భాస్కర్ రెడ్డి, రైతు



సకాలంలో మాకు ఎరువులు అందించకుంటే అధిక ధర చెల్లించి ప్రైవేటు డీలర్ల వద్ద ఎరువులను కొనుగోలు చేయక తప్పదు. ఇప్పటి దాకా ఎరువులను డీసీఎంఎస్ కేంద్రాల ద్వారా ఎంఆర్‌పీ ధరకే కొనుగోలు చేశాము. మార్క్‌ఫెడ్ సంస్థ ఉన్నతాధికారులు మా పరిస్థితిని సానుభూతితో అర్థం చేసుకుని మాకు ఎరువులను డీసీఎంఎస్ కేంద్రాల ద్వారా అందించేందుకు చర్యలు తీసుకోవాలి.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా



నంద్యాల క్రైం, ఆగస్టు 4 : సైబర్ నేరాలు పెరిగిపోతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా సూచించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ వ్యాపారులు, రియల్ ఎస్టేట్, ఐటీ ప్రొఫెషనల్స్‌ను టార్గెట్ చేస్తూ వాట్సాప్ గ్రూపు లింక్స్ పంపించి బిట్ కాయిన్స్, క్రిప్టో కరెన్సీ పేరిట ఇన్వెస్ట్ చేయించి చివరకు వాటిని కాజేస్తున్నారన్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు ఇస్తామంటూ ప్రజలను ఆకర్షించి కోట్లలో దోచేస్తున్నారని, వర్చువల్ అకౌంట్స్‌తో మాయ చేస్తూ లక్షల్లో నకిలీ సైట్‌లో ఇన్వెస్ట్ చేయించి మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. సైబర్ నేరగాళ్లు తాము ఎంచుకున్న వారికి కొన్ని లింక్‌లు పంపి మీపై కేసు నమోదైందని ఫేక్ డాక్యుమెంట్స్ చూపుతూ మోసం చేస్తారని, అందువల్ల ప్రజలు వారి వలలో పడొద్దని సూచించారు. ఇలాంటి మోసాలకు గురైనవారు వెంటనే పోలీసులకు సమాచారమందించాలన్నారు. సైబర్ హెల్ప్ లైన్ నెంబర్ 1930కు కాల్ చేయాలని లేదా నంద్యాల సైబర్ క్రైం నెంబర్ 154987034కు ఫిర్యాదు చేయాలని ఎస్పీ సూచించారు.

జలాశయానికి కొనసాగుతున్న వరద



పది గేట్ల ద్వారా దిగువకు వెళ్తున్న వరద

శ్రీశైలం, ఆగస్టు 4: ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి నీలం సంజీవరెడ్డి శ్రీశైలం ప్రాజెక్ట్ జలాశయానికి వరద ఉధృతి కొనసాగుతోంది. జూరాల, సుంకేసుల నుంచి వరద ప్రవాహం పెరగడంతో డ్యామ్ క్రస్టుగేట్లను ఆదివారం 10 క్రస్టుగేట్లును 15 అడుగుల మేర ఎత్తి నీటిని దిగువ నాగార్జునసాగర్‌కు వదులుతున్నారు. జూరాల నుంచి 2,63,452 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 1,37,039 క్యూసెక్కులు మొత్తం 4,00,491 వరద ప్రవాహం వస్తోంది. ఆదివారం సాయంత్రం ఆరు గంటల సమయానికి 4,87,451 క్యూసెక్కుల వరద నీరు శ్రీశైలం జలాశయానికి చేరింది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 882.90 అడుగులుగా నమోదైంది. జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 203.8909 టీఎంసీలుగా నమోదైంది. ఆంధ్రప్రదేశ్ జల విద్యుత్ కేంద్రం ద్వారా 23,146 క్యూసెక్కులు, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం ద్వారా 35,315 క్యూసెక్కుల, డ్యామ్ క్రస్టుగేట్ల ద్వారా 3,69,250 క్యూసెక్కులు మొత్తం 4,27,711 క్యూసెక్కుల నీటిని దిగువ నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు.

తహసీల్దార్లకు స్థానాల కేటాయింపు

నంద్యాల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా నంద్యాలకు చెందిన తహసీల్దార్లు రాయలసీమలోని ఆయా జిల్లాలకు బదిలీ అయ్యారు. ఎన్నికల విధుల అనంతరం వారిని సొంత జిల్లాలకు బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. వీరంతా ఇప్పటికే నంద్యాల జిల్లాలో రిపోర్టు చేసుకున్నారు. వీరిలోని కొంతమందికి ఆయా మండలాల్లో పోస్టింగులు కేటాయిస్తూ కలెక్టర్ రాజకుమారి ఉత్తర్వులు జారీ చేశారు. మిగతా తహసీల్దార్లకు రెండు రోజుల్లో పోస్టులు స్థానాలను కేటాయించనున్నట్లు సమాచారం.

	తహసీల్దారు	కేటాయించిన స్థానం
1.	డి. రవికుమార్	కలెక్టరేట్ ఏఓ
2.	డి. శుభాకర్ రావు	కలెక్టరేట్,మేజిస్ట్రీయల్ సెక్షన్
3.	కే. నరసింహారావు	కలెక్టరేట్, కో ఆర్డినేషన్
4.	హెచ్. హరినాథరావు	కలెక్టరేట్ (ల్యాండ్)
5.	పి. జ్యోతి రత్నకుమారి	ఆళ్లగడ్డ
6.	ఎస్. సుభద్ర	దోర్నిపాడు
7.	జీ.వీ. మల్లికార్జున రావు	రుద్రవరం
8.	బి. పుష్ప కుమారి	సిరివెళ్ల
9.	ఎం. శ్రీనివాసులు	ఉయ్యాలవాడ
10.	ఎన్. రవికుమార్	చాగలమర్రి
11.	వై. నరేంద్రనాథ రెడ్డి	పాణ్యం
12.	బీ.వీ.ఎస్ విద్యాసాగర్	గడివేముల
13.	బీ. శ్రీనివాసులు	నందికొట్కూరు
14.	వి. చంద్రశేఖర్ నాయక్	జూపాడు బంగ్లా
15.	టి. శ్రీనివాసులు	మిడ్తూరు
16.	ఎం. శివరాముడు	పగిడ్యాల
17.	జి. ఉమారాణి	కొత్తపల్లి
18.	కే.వీ. శ్రీనివాసులు	శ్రీశైలం
19.	కే. శ్రీనివాస గౌడ్	వెలుగోడు
20.	జి. రత్న రాధిక	ఆత్మకూరు
21.	ఎస్. ప్రకాశ్ బాబు	బేతంచర్ల
22.	బి. భారతి	ప్యాపిలి



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రవీంద్రనాథ్ రెడ్డి

రియల్ ఎస్టేట్ వివాదాలతోనే హత్య

- రౌడీషీటర్ హత్య కేసులో నిందితుల అరెస్టు
- రెక్కీ నిర్వహించి పథకం ప్రకారం హత్య

నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 4: రౌడీషీటర్ వెంకటసాయి, అలియాస్ ఖవ్వ హత్య కేసును ఛేదించి ఏడుగురు నిందితులను అరెస్టు చేసినట్లు నంద్యాల డీఎస్పీ రవీంద్రనాథ రెడ్డి తెలిపారు. ఆదివారం రాత్రి స్థానిక డీఎస్పీ కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి హత్య కేసు వివరాలను ఆయన వెల్లడించారు. నంద్యాల పట్టణం గుడిపాడు గడ్డకు చెందిన రౌడీషీటర్ వెంకటసాయి అలియాస్ ఖవ్వ (30) ఈ నెల 2వ తేదీన నంద్యాల మండలంలోని అయ్యలూరి మెట్ట పొలాల్లో ఉన్న వెంచర్‌లో దారుణ హత్యకు గురయ్యారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుల కోసం ప్రత్యేక బృందాలు గాలించి నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఆయన చెప్పిన వివరాల మేరకు... గతంలో మహానంది మండలం అల్లి నగర్ గ్రామానికి చెందిన రౌడీషీటర్ రాగినేని సంజీవ కుమార్‌కు మృతుడు వెంకటసాయికి రియల్ ఎస్టేట్, ఆర్థికపరమైన మనస్పర్థలు ఉండటంతో వెంకటసాయిని హత్య చేయాలని సంజీవ పథకం పన్నారు. ఇటీవలే ఓ కేసులో నిందితుడిగా ఉంటూ వెంకటసాయి కడప సబ్‌జైలు నుంచి బెయిల్‌పై విడుదల అయ్యాడు. పథకం ప్రకారం రెక్కీ నిర్వహించిన సంజీవ తదితరులు 2వ తేది అయ్యలూరి గ్రామంలోని ఓ వెంచర్‌లో మద్యం సేవిస్తున్న వెంకటసాయిపై అటాక్ చేసి హత్య చేశారు. హత్యకు పాల్పడిన ఏడుగురిని నంద్యాల పట్టణ శివార్లలోని చాపిరేవుల బ్రిడ్జి వద్ద ఉన్న మూలపెద్దమ్మ గుడి వద్ద ఆదివారం సాయంత్రం నిందితులను అరెస్టు చేశామని డీఎస్పీ పేర్కొన్నారు. వారి నుంచి రెండు సెల్‌ఫోన్లు ఒక కారు, ఒక మోటర్ సైకిల్, హత్యకు ఉపయోగించిన 4 వేటకత్తులు, రెండు ఇనుప రాడ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఉరుకుందకు పోటెత్తిన భక్తులు



జుమాలదిన్నె గ్రామంలో ఉరుకుందకు వెళ్లే భక్తుల వాహనాలతో ట్రాఫిక్

కోసిగి, ఆగస్టు 4: కౌతాళం మండలంలోని ఉరుకుంద ఈరన్న ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు ఉరుకుంద క్షేత్రంలోని ఈరన్న స్వామిని దర్శించుకున్నారు. భక్తులు భారీగా రావడంతో కోసిగి మండలంలోని జుమాలదిన్నె ఉరుకుంద రోడ్డులో వాహనాలు రద్దీగా కనిపించాయి. ట్రాఫిక్ భారీగా ఏర్పడటంతో భక్తులు, గ్రామస్థులు ఇబ్బందులను ఎదుర్కొన్నారు.

జైన శిల్పాన్ని కాపాడుకోవాలి

-పురావస్తుశాఖ పరిశోధకుడు శివనాగిరెడ్డి



జైన శిల్పాన్ని పరిశీలిస్తున్న పురావస్తు పరిశోధకుల బృందం

కల్లూరు, ఆగస్టు 4: కల్లూరు మండలం నాయకల్లు గ్రామ శివారులో నిర్లక్ష్యంగా పడి ఉన్న వెయ్యేళ్ల నాటి వర్ధమాన మహావీరుని శిల్పాన్ని కాపాడుకోవాలని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ ఈమని శివనాగిరెడ్డి గ్రామస్తులకు విజ్ఞప్తి చేశారు. మారుమూల ప్రాంతాల్లో అస్తవ్యస్తంగా పడిఉన్న శిల్పాలు, శిలాశాసనాలు, శిథిలాలపై స్థానికులకు అవగాహన కల్పించే ప్రిజర్వ్ హెరిటేజ్ ఫర్ పోస్టెరిటీ కార్యక్రమంలో భాగంగా ప్లీచ్ ఇండియా బృందం నాయకల్లు గ్రామంలో నిర్లక్ష్యంగా పడి ఉన్న శిల్పాలను ఆదివారం పరిశీలించింది. ఊరిబయట పొదల్లో 24వ జైన తీర్థంకుడైన వర్ధమాన మహావీరుడి శిల్పం, ఒక స్థంభం, పీఠాలను గ్రామానికి తరలించి భద్రపరిచి, చారిత్రక వివరాలతో ఒక పేరు పలకను ఏర్పాటు చేయాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర పురావస్తుశాఖా అధికారి మహేంద్రనాయుడు, ప్లీచ్ ఇండియాకు చెందిన జితేంద్ర, చరణ్, శ్రీహరి, హరీష్, ఉదయ్‌కిరణ్, ధుర్గ, మైత్రేయ, కౌస్తూబ్ పాల్గొన్నారు.

వైసీపీ కార్యకర్త దారుణ హత్య

- సార్వత్రిక ఎన్నికల్లో సహకరించలేదన్న అక్కసుతోనే దారుణం?
- ఇంట్లో నుంచి లాక్కొచ్చి బండరాళ్లతో మోది చంపేసిన వైనం
- ఎన్నికలకు ముందు టీడీపీలో చేరిన హంతకులు



సుబ్బరాయుడు (ఫైల్)

మహానంది, ఆగస్టు 4: సార్వత్రిక ఎన్నికల్లో సహకరించలేదన్న అక్కసుతో ప్రత్యర్థి పార్టీకి చెందిన వ్యక్తిని కొంతమంది దారుణంగా హత్య చేశారు. దాడిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన మృతుడి భార్య బాల సుబ్బమ్మ కూడా తీవ్ర గాయాలపాలైంది. ఈ ఘటన మహానంది మండలం సీతారామపురంలో జరిగింది. ఈ గ్రామానికి చెందిన సుబ్బారాయుడు అలియాస్ పెద్దన్న (68) వైసీపీ కార్యకర్తగా రాజకీయాల్లో క్రియాశీలకంగా కొనసాగుతున్నాడు. అతడిని ఇటీవల వైసీపీ నుంచి టీడీపీ చేరిన కొందరు దారుణంగా హత మార్చారు. ఇందుకు సంబంధించిన మృతుడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీతారామాపురం గ్రామానికి చెందిన శ్రీనివాసరెడ్డి, ప్రభాకర్‌రెడి, భరత్‌రెడ్డి, పుల్లారెడ్డి, లక్ష్మిరెడ్డి, శేఖర్‌రెడ్డి, కాల్లూరి శ్రీనివాసులతోపాటు మరో 38 మంది సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత కర్రలు, రాడ్లతో తన భర్తపై దాడికి తెగబడ్డారని బాలసుబ్బమ్మ పేర్కొంది. ఇంట్లో నుంచి బయటకు లాక్కుని వచ్చి బండరాళ్ళతో అతికిరాతకంగా చంపేశారని చెప్పింది. గతంలో తాము, తమపై దాడి చేసిన శ్రీనివాసరెడ్డి అంతా వైసీపీలో ఉండేవారమని, అయితే ఎన్నికలకు ముందు శ్రీనివాసరెడ్డి టీడీపీలో చేరారని, ఎన్నికల్లో వారికి సహకరించలేదన్న కసితోనే తమపై దాడి చేశారని ఆవేదన వ్యక్తం చేసింది. కేసు నమోదు చేసి సుబ్బరాయుడు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని రూరల్ సీఐ శివకుమార్ రెడ్డి తెలిపారు. అదేవిధంగా గాయాలపాలైన బాల సుబ్బమ్మను నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇదిలా ఉండగా సీతారామపురం గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ఆదివారం పోలీస్ పికెట్‌ను ఏర్పాటు చేసారు. ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా, అడిషినల్ ఎస్పీ ప్రవీణ్‌కుమార్ ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు, నంద్యాల రూరల్ సీఐ శివకుమార్‌రెడ్డి ఎస్ఐ నాగేంద్రప్రసాద్‌లు ఆదివారం తెల్లవారుజాముననే సీతారామపురం చేరుకుని హత్యకు గల కారణాలను సేకరించారు.

నివాళులర్పించిన వైసీపీ నేతలు : ఆదివారం సాయంత్రం ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి, మాజీ ఎమ్మెల్యేలు శిల్పాచక్రపాణిరెడ్డి, కాటసాని రామిరెడ్డి, కాటసాని రాంభూపాల్ రెడ్డి, ఎస్వీ మోహన్‌రెడ్డి, శిల్పా రవిచంద్రారెడ్డిలు సీతారామపురం గ్రామానికి చేరుకుని వైసీపీ కార్యకర్త సుబ్బరాయుడుకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేవలం సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీకి అనుకూలంగా వ్యవహరించినందువల్లే టీడీపీ నాయకుడు శ్రీనివాసరెడ్డి, అనుచరులు హత్యకు పాల్పడ్డారన్నారు. వ్యక్తిగత కక్షతో గ్రామంలో తన ఉనికిని కాపాడుకునేందుకు ఇలాంటి దారుణాలకు ఒడిగడతారా? అని ప్రశ్నించారు. మృతుడి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ఘనంగా పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత జన్మదిన వేడుకలు



రక్తదానం చేస్తున్న ఎమ్మెల్యే తనయుడు గౌరు జనార్ధన్‌రెడ్డి



గౌరు దంపతులకు పుస్తకాలను అందజేస్తున్న నాయకులు

కల్లూరు, ఆగస్టు 4: పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత జన్మదిన వేడుకలను టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు అభిమానుల సమక్షంలో ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం తన స్వగృహంలో నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జ్ గౌరు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో పాణ్యం, నందికొట్కూరు నియోజకవర్గాల నుండి ముఖ్య నాయకులు, అధికారులు కార్యకర్తలు ఎమ్మెల్యే గౌరుచరితకు పూలబోకేలు, పూలమొక్కలు, పుస్తకాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గౌరుచరిత కేక్‌కట్ చేయగా టీడీపీ నాయకులు స్వీట్లు పంచి సంబరాలు జరుపుకున్నారు. కల్లూరులోని చౌడేశ్వరిదేవి అమ్మవారిని గౌరుచరిత, ఆమె తనయుడు గౌరు జనార్ధన్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ నాయకులు వారిని శాలువాలతో ఘనంగా సత్కరించారు.



చౌడేశ్వరిదేవి ఆలయంలో గౌరుచరిత పూజలు

చికిత్స పొందుతూ రైతు మృతి



నాగేంద్ర (ఫైల్)

ఆళ్లగడ్డ/దొర్నిపాడు, ఆగస్టు 4: అప్పులు అధికమై ఆత్మహత్యకు యత్నించిన రైతు చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా... దొర్నిపాడు మండలం భాగ్యనగరం గ్రామానికి చెందిన సుబ్బరాయుడు కుమారుడు నాగేంద్ర (38) మూడేళ్ల నుంచి సీడు పత్తి పంట 5 ఎకరాల్లో సాగు చేస్తున్నాడు. అయితే ప్రకృతి ప్రభావం వల్ల ఆశించిన మేర దిగుబడులు రాలేదు. ఈ పంటల సాగుకోసం వివిధ చోట్ల రూ.14 లక్షలు అప్పు చేశాడు. పంటలు చేతికి రాకపోవడం, రుణదాతల నుంచి ఒత్తిళ్ల అధికం కావడంతో అప్పు తీర్చలేక శనివారం నాగేంద్ర సొంతపొలంలోనే విషపు గుళికలు మింగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈవిషయాన్ని తెలుసుకున్న కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. నాగేంద్రకు భార్య, ఇద్దరు పిల్లలు సంతానం. మృతుడి తండ్రి సుబ్బరాయుడు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆళ్లగడ్డ పట్టణ ఎస్ఐ నగీనా తెలిపారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

సి.బెళగల్, ఆగస్టు 4: మండలంలోని కొత్తకోట దగ్గర ఉన్న ఎకరన్నర పొలానికి నీళ్ల కట్టుకోడానికి కురువ ఖాజ (40) అనే రైతు బావిలోకి దిగి పుట్ బాల్ వాచర్ బిగిస్తుండగా కరెంట్ షాక్ తగిలి మృతి చెందాడు. రైతు గ్రామం సుంకేసుల. ఈ ఘటన ఆదివారం జరిగింది. రైతు బావిలోకి దిగి పుట్‌బాల్ వాచర్ బిగిస్తుండగా ఈ ప్రమాదం జరగడం గమనించిన రైతులు కరెంట్ సరఫరా నిలివేశారు. అప్పటికే రైతు మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న సి బెళగల్ ఎస్ఐ తిమ్మారెడ్డి సిబ్బందితో కలిసి బావిలో పడి ఉన్న మృతదేహాన్ని బయటకు తీయించారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోడుమూరుకు తరలించినట్లు ఎస్ఐ తిమ్మారెడ్డి తెలిపారు. ఖాజాకు భార్య పద్మావతమ్మ, ముగ్గురు కూతుర్లు ఉన్నారు.

ఆత్మహత్యాయత్నం చేసిన విద్యార్థి...

సి.బెళగల్, ఆగస్టు 4: మండలంలోని పలుకుదొడ్డి గ్రామానికి చెందిన ఉరుకుందమ్మ, శేఖర్ దంపతుల కుమారుడు మనోజ్(16) ఆత్మహత్యాయత్నం చేసి కోలుకోలేక ఆదివారం మృతి చెందారు. ఈ దంపతులకు ఒక కుమారుడు, ఒక కూతురు ఉన్నారు. పదో తరగతి ఫెయిల్ అయిన మనోజ్ తండ్రి మందలించాడని వారం రోజుల కింద విష ద్రావణం తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఎస్ఐ తిమ్మారెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

భర్త చేతిలో గాయపడిన మహిళ మృతి

కోడుమూరు (రూరల్), ఆగస్టు 4: మండలంలోని పులకుర్తి గ్రామంలో గత బుధవారం అర్ధరాత్రి భర్త దాడిలో తీవ్రంగా గాయపడిన మహిళ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. గ్రామానికి చెందిన సుంకన్న, లక్ష్మీదేవి దంపతుల కూతురు మల్లీశ్వరి భర్త తాగుడుతో విసిగిపోయి బస్తిపాడు నుంచి పిల్లలను తీసుకొని పుట్టింటికి వచ్చింది. రంగడు గత నెల 31 అర్ధరాత్రి మద్యం తాగి వచ్చి గొడవ పడ్డాడు. రోకలితో భార్య మల్లేశ్వరి, అత్త లక్ష్మీదేవి తలపై కొట్టాడు. అడ్డుగా వచ్చిన మామ సుంకన్నపై కూడా దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన తల్లీకూతుళ్లను కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే కోలుకోలేక మల్లేశ్వరి ఆదివారం మృతి చెందినట్లు ఎస్ఐ బాలనరసింహులు తెలిపారు.

లక్ష్మీనగర్ తండాలో కార్డన్ సెర్చ్

కోడుమూరు (రూరల్), ఆగస్టు 4: వెల్దుర్తి మండలంలోని లక్ష్మీనగర్ తండాలో ఆదివారం ఉదయం కార్డన్ సెర్చ్ నిర్వహించినట్లు సెబ్ సీఐ రామాంజనేయులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూలు సెబ్, స్క్వాడ్, వెల్దుర్తి పోలీసులతో కలిసి మూకుమ్మడిగా తనిఖీ చేశామని అన్నారు. దాడిలో 35 లీటర్ల నాటుసారా గుర్తించి సీజ్ చేశామని తెలిపారు. అలాగే నాటుసారా తయారీకి సిద్ధంగా ఉన్న 1200 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామన్నారు.

యువకుడిపై మద్యం బాబుల దాడి

నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 4: నంద్యాల మండలం వెంకటేశ్వరపురం గ్రామంలో దారుణం చోటు చేసుకుంది. దారిన పోయే వ్యక్తిని బెదిరించి మద్యానికి డబ్బులు ఇవ్వాలని గొడవ పెట్టుకున్నారు. దీనికి కొనసాగింపుగా అతని సోదరుడి బట్టలూడదీసి దాడి చేశారు. ఈ ఘటన ఆదివారం జరిగింది. నంద్యాల పట్టణం ఎన్జీవో కాలనీకి చెందిన కార్తీక్ వెంకటేశ్వరపురంలోని ఎస్డీఆర్ ఆకాంక్ష జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. గత గురువారం కళాశాల ఛైర్మన్ పుట్టిన రోజు వేడుకలకు హాజరై తన స్నేహితుడు మధుతో కలసి ఇంటికి వెళుతుండగా కళాశాల సమీపంలోని వెంచర్‌లో మద్యం తాగుతున్న కొంత మంది వీరిద్దరిని అటకాయించి డబ్బులు ఇవ్వాలని బెదిరించారు. ఈ విషయాన్ని కార్తీక్ తన అన్న సాయి లోకేశ్వర రెడ్డికి చెప్పడంతో ఆయన తన స్నేహితులను పిలుచుకుని ఘటనా స్థలానికి చేరుకున్నారు. మద్యం బాబులు ఆగ్రహంతో సాయి లోకేశ్వరరెడ్డి బట్టలు ఊడదీసి అమానుషంగా దాడి చేశారు. వెంకటేశ్వరపురం గ్రామానికి చెందిన శంకర్ సాయి.. లోకేశ్వర్‌రెడ్డి చెవిని కొరికాడు. తీవ్ర గాయాలతో అపస్మారక స్థితిలోకి లోకేశ్వర్‌రెడ్డి వెళ్ళాడు. ఈ దాడుల దృశ్యాలు అక్కడ ఉన్న సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. ఈ ఘటనపై బాధితులు నంద్యాల తాలూకా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ దస్తగిరి బాబు తెలిపారు.

టీడీపీ, వైసీపీ కార్యకర్తల మధ్య ఘర్షణ

బేతంచెర్ల, ఆగస్టు 4: మండలంలోని సంకలాపురం గ్రామంలో టీడీపీ, వైసీపీ కార్యకర్తల మధ్య ఆదివారం రాత్రి ఘర్షణ చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. టీడీపీ కార్యకర్త మల్లికార్జున గ్రామంలోని దేవాలయానికి భజనకు వెళ్తుండగా.. వైసీపీ కార్యకర్తలు ఆయనపై ఘర్షణ పడి దాడి చేసి గాయపరిచారు. వైసీపీ కార్యకర్తలు రొక్కం నాగేశ్వరరెడ్డి, బండి కొండారెడ్డి, తెలుగు కృష్ణుడు, తెలుగు రమేష్, మహేష్, తెలుగు దనుష్, శివశంకర్‌రెడ్డిలు మల్లికార్జునను దారికి అడ్డం కాచి నానా దుర్భాషలాడి కొట్టి గాయపరిచారు. దీంతో కుటుంబ సభ్యులు మల్లికార్జునను చికిత్స నిమ్మిత్తం బేతంచెర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న బేతంచెర్ల పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. బాధితుడు మల్లికార్జున ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఘనంగా చౌడేశ్వరీదేవి జయంతి

● అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు ● బోనాలు సమర్పించిన మహిళలు ● భక్తులకు అన్నదానం



వెలుగోడు: పూజలు చేస్తున్న భక్తులు



మిడుతూరులో పూజలు చేస్తున్న తొగటవీర క్షత్రియులు



ఆత్మకూరులో బోనాలను ఊరేగిస్తున్న తొగటవీర క్షత్రియులు

ఆత్మకూరు, ఆగస్టు 4: పట్టణంలోని తోటగేరిలో చౌడేశ్వరీదేవి జయంత్యుత్సవాలు ఆదివారం శోభాయమానంగా జరిగాయి. ఉత్సవాన్ని పురస్కరించుకుని ఆలయంలో గణపతిపూజ, అభిషేకాలు, అర్చనలు తదితర క్రతువులను శాస్ర్తోక్తంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. మహిళలు సామూహిక సహస్ర కుంకుమార్చన చేశారు. అదేవిధంగా నవగ్రహ, లక్ష్మీగణపతి హోమాలను వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ నిర్వహించారు. ప్రత్యేకించి కూష్మాండబలిని శాస్ర్తోకంగా చేపట్టి ఉత్సవ క్రతువును కొనసాగించారు. కాగా జయంత్యుత్సవంలో భాగంగా సాయంత్రం బోనాల ఊరేగింపు తొగటవీర క్షత్రియ సంఘం వారు సంప్రదాయ ప్రకారం నిర్వహించారు. ఆ తరువాత కుంభాన్ని ప్రత్యేక అలంకరణ గావించి పురవీధుల్లో ఊరేగించారు. ఆలయంలో అమ్మవారికి మహా మంగళ హారతి, తొట్లోత్సవం, భజన కార్యక్రమాలతో ఉత్సవానికి ముగింపు పలికారు. విజయవాడలోని జనరల్ స్టోర్స్ అధినేత తిమ్మయ్య సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. కాగా 24వ వార్డు కౌన్సిలర్ పాణ్యం పార్వతీ అమ్మవారికి రూ.1.25లక్షల విలువ వెండి దీపం చిమ్మెను విరాళంగా అందజేశారు.



పాములపాడులో..

వెలుగోడు: పట్టణంలోని చౌడేశ్వరి దేవి ఆలయంలో ఆదివారం అమ్మవారి జయంతి మహోత్సవాన్ని నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

పాములపాడు: పాములపాడులోని చౌడేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారి జన్మదిన వేడుకలను వైభవంగా నిర్వహించారు. పురోహితుడు కోదండరామశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం ఆషాడ బహుళ అమవాస్య, పూష్యమి నక్షత్రం అమ్మవారి పుట్టినరోజు పండుగ సందర్భంగా అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన, లలిత సహస్ర నామ పారాయణం నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. పురోహితులు మహిళలతో సాముహిక కుంకుమార్చన చేయించారు. నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

కొత్తపల్లి: కొత్తపల్లిలో వెలసిన చౌడేశ్వరి దేవి జయంతి వేడుకలను భక్తులు ఘనంగా జరుపుకొన్నారు. ఆదివారం అమ్మవారి జయంతి వేడుకలను పురస్కరించుకుని అమ్మవారికి కుంకుమార్చన, పుష్పార్చన తదితర అభిషేకాది క్రతువులు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో తొగాట వీరశైవ లింగాయత్ సంఘంతో పాటు గ్రామస్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మిడుతూరు: చౌడేశ్వరీదేవి జయంతి సందర్భంగా ఆదివారం మిడుతూరు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు శంకరశర్మ అమ్మవారిని సుందరంగా అలంకరించారు. ఉదయం అమ్మవారికి జలాభిషేకం, పుష్పాలంకరణ నిర్వహించారు. టీడీపీ మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి అమ్మవారి బోనకుండతో ఆలయం చుట్టు ప్రదక్షిణలు చేశారు.

గడివేముల: మండలంలోని గని గ్రామంలో ఆదివారం చౌడేశ్వరీదేవి జయంతి వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించారు. అమ్మవారి జయంతి సందర్భంగా వేకువ జాము నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో హోమం చేశారు. చౌడేశ్వరీదేవికి పంచామృతాభిషేకాలు, కుంకుమార్చన, పుష్పార్చనలు చేశారు. మధ్యాహ్నం గ్రామస్థులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.







కొత్తపల్లి, ఆత్మకూరు, గని గ్రామంలో ప్రత్యేక అలంకరణలో చౌడేశ్వరి అమ్మవారు

కొత్తూరులో దేవదాయశాఖ ఉప కమిషనర్



ఉప కమిషనర్‌కు తీర్థప్రసాదాలు అందజేస్తున్న ఈవో

పాణ్యం, ఆగస్టు 4: మండలంలోని కొత్తూరు దేవస్థానంలో కర్నూలు జిల్లా దేవదాయ ఉప కమిషనర్ గురుప్రసాద్ పూజలు నిర్వహించారు. ఆదివారం ఆయనకు ఆలయ ఈవో రామకృష్ణ ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. అనంతరం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, నాగలింగేశ్వర స్వామికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం ఆలయ సిబ్బంది ఉప పకమిషనర్‌ను ఘనంగా సత్కరించి స్వామివారి చిత్రపటాన్ని, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో నందవరం ఏసీ కామేశ్వరి, అర్చకులు వీరయ్య, సురేష్, నారాయణ, ఆలయ సిబ్బంది, పాల్గొన్నారు.

బరక సంజీవరాయుడికి పూజలు

మిడుతూరు, ఆగస్టు 4: అమావాస్యను పురస్కరించుకొని మండలంలోని రోళ్లపాడు అభయారణ్యంలో వెలసిన బరక సంజీవ రాయుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి మిడుతూరు, అలగనూరు, తిమ్మాపురం, చెరుకుచెర్ల, పారుమంచాల, రోళ్లపాడు గ్రామాలతో పాటు వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. సంజీవరాయుడికి ఉదయం కుంకుమ అర్చన, ఆకుపూజ, హోమం, పల్లకీ సేవ నిర్వహించారు. భక్తులకు ఆలయ కమిటీ అన్నదానం ఏర్పాటు చేశారు.

వైభవంగా పల్లకీ ఉత్సవం

శ్రీశైలం, ఆగస్టు 4: శ్రీశైల మహాక్షేత్రంలో లోకకల్యాణార్థం ఆదివారాన్ని పురస్కరించుకొని స్వామి, అమ్మవార్లకు పల్లకీ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో నిర్వహించిన ఉత్సవ కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహా గణపతికి ప్రత్యేక పూజలు చేశారు. తరువాత స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు శాస్ర్తోక్తంగా షోడశోపచార పూజలు నిర్వహించి పల్లకీలో ఆశీనులనుజేసి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఘనంగా ఉత్సవాన్ని నిర్వహించారు.

ఎస్సీ వర్గీకరణ తీర్పుపై నిరసన



పాములపాడులో నిరసన తెలుపుతున్న మాలమహానాడు నాయకులు

పాములపాడు, ఆగస్టు 4: దేశంలోని అత్యున్నత న్యాయస్థానం ఎస్సీ రిజర్వేషన్లపై ఇచ్చిన తీర్పును నిరసిస్తూ మాలమహానాడు నాయకులు ర్యాలీ నిర్వహించారు. ఆదివారం పాములపాడులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి మాల మహానాడు నాయకులు కలబండి అంకన్న, అబ్రహం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన భారత రాజ్యాంగంలో రిజర్వేషన్లు కల్పించింది వెనుకబడిన ఎస్సీ వర్గానికి చేయూత అందించి, అభివృద్ధి పరచడానికి అని, ఇప్పుడు ఈ రిజర్వేషన్లను మళ్లీ వర్గీకరించడం ఏమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు రాజు, ఎర్రన్న, రాజన్న, మల్లయ్య, నగేశ్, క్రిష్టఫర్, బాలస్వామి, నాగరాజు, శ్రీకాంత్, శేషు, ప్రసాద్, రవి, దానమయ్య పాల్గొన్నారు.

'ఏపీటీఎఫ్ మహాసభలను జయప్రదం చేయండి'



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆత్మకూరు, ఆగస్టు 4: విజయనగరంలో అక్టోబరు నెలలో ఏపీటీఎఫ్ 80 వసంతాల వేడుకను పురస్కరించుకుని నిర్వహించబోవు 20వ విద్యా-వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు పిలుపునిచ్చారు. పట్టణంలోని ఆ సంఘం కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో 3,4,5 తరగతులను జీవో 117 ప్రకారం ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడం వల్ల ప్రాథమిక విద్యా వ్యవస్థ నాశనమైందని అన్నారు. వెంటనే జీవో 117 ఉత్తర్వులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల, తెలుగు మీడియం బోధించాలన్నారు. ఏపీటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు కమతం శంకర్, రాష్ట్ర కార్యదర్శి మధుసూదన్‌రావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాధవస్వామి, శ్రీనివాసులు, కర్నూలు జిల్లా కార్యదర్శి మరియానందం, సహాధ్యక్షులు షేక్ ఉమర్, నాయకులు పుల్లయ్య శేషయ్య, శ్రీరాములు, అజయ్‌కుమార్, అబ్దుల్‌వహీద్, జయరామ్ తదితరులు ఉన్నారు.

ఆలయ భూముల పరిశీలన



మల్యాలలో బీడుగా ఉన్న ఆలయ భూమిని పరిశీలిస్తున్న గ్రామస్థులు, నాయకులు

నందికొట్కూరు రూరల్, ఆగస్టు 4: నందికొట్కూరు మండలంలోని మల్యాల గ్రామంలో బీడుగా ఉన్న ఆలయ భూములను మల్యాల గ్రామ రైతులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఆదివారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ ఈశ్వరస్వామి, చెన్న కేశవస్వామి, రామాంజనేయ స్వామి వార్ల దేవాలయ భూములు దాదాపుగా 83 ఎకరాలు ఉందని అన్నారు. ఈ భూమిని మూడేళ్ల క్రితం దేవదాయశాఖ అధికారులు వేలం పాట నిర్వహించారు. అప్పుడు మూడేళ్ల కాపరిమితితో వేలం నిర్వహించారు. కాలం పూర్తి అయిపోయినా దేవదాయశాఖ అధికారులు ఎందుకు వేలం వేయడం లేదని ప్రశ్నించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు పక్కీర్ సాహెబ్, సీఐటీయూ నాయకుడు గోపాలకృష్ణ తదితరులు ఉన్నారు. అలయ ఈవో వెంకటరమణను వివరణ కోరగా మూడు సంవత్సరాల క్రితం వేలం పాట నిర్వహించామని, గడువు కూడా ముగిసిపోయిందని చెప్పారు. త్వరలో వేలం పాట నిర్వహిస్తామని తెలిపారు. శాంతి భద్రతల దృష్ట్యా జాప్యం జరుగుతోందని అన్నారు.

ఎమ్మెల్యే గౌరు చరిత జన్మదిన వేడుకలు



అంధ విద్యార్థులకు పండ్లు అందజేస్తున్న టీడీపీ నాయకులు



కేక్ కట్ చేస్తున్న పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత

పాణ్యం, ఆగస్టు 4: పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు జన్మదిన శుభాకాంక్షలు తెలపడానికి మండలం నుంచి పెద్ద ఎత్తున టీడీపీ కార్యకర్తలు కర్నూలుకు తరలివెళ్లారు. పాణ్యం మండలంలో పలు చోట్ల కార్యకర్తలు పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. నెరవాడ టీడీపీ నాయకుడు అమరసింహారెడ్డి ఆధ్వర్యంలో నంద్యాలలోని జీవనజ్యోతి అంధుల పాఠశాలలో అంధ విద్యార్థులకు పండ్లు అందజేశారు. కార్యక్రమంలో నారాయణరెడ్డి, నరసింహారెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డి, మునీశ్వరరెడ్డి పాల్గొన్నారు. కొనిదేడులో టీడీపీ నాయకులు రాంపుల్లారెడ్డి ఆధ్వర్యంలో గౌరు చరిత జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పంపిణీ చేశారు.

గడివేముల: మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం టీడీపీ కార్యకర్తలు, నాయకులు ఎమ్మెల్యే గౌరుచరిత జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాణ్యం నియోజకవర్గ ఐటీడీపీ బృందం సభ్యులు ఎమ్మెల్యే గౌరుచరితకు పుష్పగుచ్ఛాలు అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమెతో కేక్ కట్ చేయించారు. కార్యక్రమంలో అయ్యూబ్‌బాషా, రాము, ఉసేన్ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు అందని ఎక్స్‌రే సేవలు

● విడి భాగాలు లేక ఉపయోగించని వైనం



పాణ్యం సీహెచ్‌సీలో నిరుపయోగంగా ఉన్న ఎక్స్‌రే యంత్రం

పాణ్యం, ఆగస్టు 4: జిల్లాలోని సమాజిక ఆరోగ్య కేంద్రాలలో ఏర్పాటు చేసిన ఎక్స్‌రే యంత్రాలు నిరుపయోగంగా మారాయి. ఎక్స్‌రే యంత్రానికి అవసరమైన విడిభాగాలు లేక రోగులు ఎక్స్‌రే సేవలు పొందడం లేదు. 2015 అక్టోబరు 26 కర్నూలు ఉమ్మడి జిల్లాలో డిస్ట్రిక్ట్ ప్రైమరీ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఆధ్వర్యంలో 16 సామాజిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాలకు దాదాపు రూ.2 లక్షల విలువైన ఎక్స్‌రే యంత్రాలు మంజూరు చేశారు. ఇవి వినియోగించడానికి అవసరమైన ఎక్స్‌రే క్యాసెట్, కన్సోల్, కంప్యూటర్ సెట్ విడిభాగాలను మంజూరు చేయకపోవడంతో ఈ యంత్రాలు నిరుపయోగంగా మారాయి. రోగులకు ఎక్స్‌రే సేవలు అందకపోవడంతో దూరప్రాంతాలకు వెళ్లి అధిక ఖర్చుతో ఎక్స్‌రే పరీక్షలు చేయించుకోవాల్సి వస్తోందని రోగులు ఆరోపిస్తున్నారు. పాణ్యంలో 2016 నవంబరు 11న రూ. 3.20 కోట్ల నాబార్డు నిధులతో అన్ని సౌకర్యాలతో భవనాన్ని నిర్మించి ప్రారంభించి 2018 మే 24న ప్రారంభించారు. ఆరోగ్య కేంద్రాలకు 30 పడకల గదులు, ఆపరేషన్ థియేటర్, ఎక్స్‌రే యంత్రం, ఓపీ గదులు, పరుషుల, మహిళల వార్డులు, నేత్ర పరీక్ష వార్డులు, బేబీ కేర్ యూనిట్ యంత్రాలు, డెలివరీ రూం, ఆక్సిజన్ సిలిండర్లు, స్టెరిలైజేషన్, ఆపరేషన్ యంత్రాలు, రకవరి గది, ఆపరేటర్ రూం, ఐసోలేషన్ సిడిఆర్, ఎల్‌డీఆర్ యూనిట్, ఎగ్జామినేషన్ రూం, కోల్డ్ స్టోర్‌రూం, నర్స్ చేంజ్ రూంలు ఏర్పాటు చేశారు. అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నా ఎక్స్‌రే సౌకర్యం మాత్రం అందుబాటులో లేదు.

అందుబాటులో లేని కంటి వైద్య సేవలు

పాణ్యం సీహెచ్‌సీలో కంటి వైద్య సేవలు అందుబాటులో లేవు. గతంలో టీడీపీ ప్రభుత్వం అపోలో సౌజన్యంతో కంటి వైద్య పరీక్షలతో పాటు ఉచిత కంటి అద్దాలు పంపిణీ చేసేవారు. 2019 తర్వాత సీహెచ్‌సీలలోని కంటి వైద్యసిబ్బందిని సంచార వైద్య కేంద్రాలకు పంపించడంతో గ్రామీణ ప్రాంతాల రోగులకు కంటి వైద్య సేవలు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సీహెచ్‌సీలో రూ.20 లక్షల విలువైన యంత్ర సామగ్రి ఉన్నా కంటి వైద్యులు లేక కంటి వైద్య సేవలందడంలేదు. గతంలో ప్రతి రోజూ దాదాపు 60 నుంచి వంద ఓపిలు నమోదయ్యేవి. ప్రస్తుతం కంటి అద్దాల పంపిణీకే పరిమితమైంది. రోగులకు అవసరమైన మందులు ఇచ్చేవారు అందుబాటులో లేకపోవడం విచారకరం

ప్రతిపాదనలు పంపించాం

సీహెచ్‌సీలలో ఎక్స్‌రే యంత్రాలు అందుబాటులో ఉన్నాయి. వీటిలో ఎక్స్‌రే ఫిల్మ్ బాగాలు అందాల్సి ఉంది. గత మూడు నెలల క్రితమే ప్రభుత్వం మంజూరు చేయల్సి ఉండగా ఎన్నికల కోడ్‌తో జాప్యం ఏర్పడింది. త్వరలో ఎక్స్‌రే సేవలను రోగులు పొందే అవకాశం లభిస్తుంది.

డాక్టర్ జప్రుల్లా, డీసీహెచ్ఎస్, నంద్యాల

7న రాకపోకలకు అంతరాయం

పాణ్యం, ఆగస్టు 4: రైల్వే రెండో మార్గం నిర్మాణ పనుల్లో భాగంగా ఈనెల 7వ తేదీన పాణ్యం, బనగానపల్లె ఆర్అండ్‌బీ రహదారిపై వాహనాల రాకపోకలను నిలిపివేస్తున్నట్లు డీటీ రమాదేవి తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ పాణ్యం రైల్వేగేటు వద్ద రైల్వే మార్గం పనులు ప్రారంభించనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారన్నారు. ప్రజలు, ప్రయాణికులు సహకరించాలని కోరారు. ప్రత్యామ్నాయ మార్గాలపై సోమవారం ప్రజలకు మరిన్ని వివరాలు అందిస్తామన్నారు.

యువకుడి అనుమానాస్పద మృతి

పాములపాడు, ఆగస్టు 4: మండలంలోని బానుముక్కల గ్రామ శివార్లలోని ఈదుల వాగులో అనుమానాస్పద స్థితిలో మధు (25) మృతి చెందాడు. ఆదివారం పాములపాడు ఎస్‌ఐ అశోక్ తెలిపిన వివరాలివీ.. ఆత్మకురు మండలం కరివేన గ్రామానికి చెందిన నరసింహ తన కుమారుడు మధు కనిపించడం లేదని ఆత్మకూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే ఆదివారం బానుముక్కల గ్రామ శివార్లలోని ఈదుల వాగులో మధు శవమై తేలాడు. దీంతో పాములపాడు పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

శాకంబరిగా అమ్మవారు

నంద్యాల (కల్చరల్), ఆగస్టు 4: నంద్యాల సంజీవనగర్ రామాలయంలో వెలసిన కాశీవిశాలాక్షి అమ్మవారు వారాహిమాత దేవిగా, శాకంబరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. సాయంకాలం సామూహిక ఉచిత లక్ష కుంకుమార్చన నిర్వహించారు. భగవత్ సేవాసమాజ్ కమిటీ అధ్యక్షుడు సముద్రాల సూరయ్య, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

అంజుమన్ కమిటీ మండల అధ్యక్షుడిగా మోమిన్ రసూల్

వెలుగోడు, ఆగస్టు 4: అంజుమన్ కమిటీ వెలుగోడు మండల అధ్యక్షుడిగా మోమిన్‌రసూల్ ఉపాధ్యక్షుడిగా సయ్యద్ సెక్రటరీగా షబ్బీర్ అహ్మద్‌ను ఆదివారం ఎన్నుకున్నారు. స్థానిక అరబిక్ మదరాస కళాశాలలో మైనారిటీల సమావేశం నిర్వహించి ఈ సమావేశంలో నూతన కమిటీతో పాటు సభ్యులను ఎన్నుకున్నారు. ఎన్నికైన కమిటీకి పలువురు నాయకులు ప్రముఖులు అభినందనలు తెలిపారు.

సీపీఎం నాయకులకు నివాళి



ఆత్మకూరులో మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు రాజశేఖర్



కొత్తరామాపురంలో నివాళి అర్పిస్తున్న నాయకులు

ఆత్మకూరు, ఆగస్టు 4: సీపీఎం నాయకులు షడ్రక్, సున్నం రాజయ్యకు ఆ పార్టీ నాయకులు ఘనంగా నివాళి అర్పించారు. ఆదివారం షడ్రక్, సున్నం రాజయ్య నాలుగో వర్ధంతి సందర్భంగా పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. వారు చేసిన సేవలు స్ఫూర్తిదాయకమని ఆ పార్టీ నాయకులు రాజశేఖర్, రణధీర్, రామ్‌నాయక్, నరసింహ నాయక్ కొనియాడారు. కార్యక్రమంలో మంజుల, సుధాకర్, స్వాములు, దినేష్, వీరన్న, గణపతి, కలిముల్లా, బీఎస్ వలి, చాంద్, కిరణ్, బాషా, మల్లయ్య, పుల్లయ్య తదితరులు ఉన్నారు.

ఆత్మకూరురూరల్: పార్టీకి షడ్రక్ సేవలు స్ఫూర్తిదాయకమని సీపీఎం మండల నాయకులు సుధాకర్ అన్నారు. ఆదివారం షడ్రక్ నాలుగో వర్ధంతిని పురస్కరించుకుని మండలంలోని కొత్తరామాపురం గ్రామంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు సుధాకర్, పార్టీ నాయకులు ప్రతాప్‌కుమార్, రమణ, స్వాములు, రైతులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



సయ్యద్ అస్లాం బాషా

మిడుతూరు, ఆగస్టు 4: మిడుతూరు గ్రామానికి చెందిన సయ్యద్ అస్లాం బాషా (49)అదృశ్యమైనట్లు ఎస్ఐ జగన్ మోహన్ తెలిపారు. వివరాలివి... అస్లాం బాషా మిడుతూరు మండలం నాగలూటి గ్రామంలో పీఎస్‌కే కంపెనీలో నైట్ సెక్యూరిటీ గార్డుగా గత 13 నెలల నుంచి విధులు నిర్వహిస్తున్నారు. విధి నిర్వహణలో భాగంగా జూలై 31వ తేదీన విధులకు వెళ్లారు. ఉదయం డ్యూటీ అయిపోయిన తరువాత ఆగస్టు ఒకటో తేదీ నుంచి తిరిగి ఇంటికి రాలేదు. బంధువుల, స్నేహితులను విచారించినా ఆచూకీ తెలియలేదు. అస్లాంబాషా సోదరుడు సయ్యద్ అంజద్ బాషా ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జగన్ మోహన్ తెలిపారు.

మహిళా తలారి మృతి

నందికొట్కూరు రూరల్ ఆగస్టు 4: నందికొట్కూరు మండలంలోని మల్యాల గ్రామంలో తలారిగా విధులు నిర్వహిస్తున్న లాల్ బీ(80) అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె మృతికి నందికొట్కూరు రెవెన్యూ సిబ్బంది నివాళి అర్పించారు. రెవెన్యూ సహాయకుల సంఘం తరఫున రూ.5 వేలు, రెవెన్యూశాఖ తరఫున ఆర్ఐ శ్యామలాదేవి రూ.25 వేలు ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు. గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం నాయకులు జక్కుల మహేష్, శిశన్న, పవన్ కుమార్, ముత్తుజావళి, శంకర్, మద్దయ్య, తదితరులు ఉన్నారు.

జనసేన సభ్యత్వం నమోదు



సభ్యత్వ నమోదు చేపడుతున్న జనసేన నాయకులు

గడివేముల, ఆగస్టు 4: జనసేన పార్టీ నాలుగో విడత క్రియాశీల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆ పార్టీ రాయలసీమ లాజిస్టిక్ కో-కన్వీనర్ మంజునాథ్ ఆదివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒకరూ సభ్యులుగా భాగస్వాములై మిగిలిన వారితో కూడా సభ్యత్వం నమోదు చేయించాలని అన్నారు. ఈ కార్యక్రమం సోమవారంతో ముగియనుందని అన్నారు. జనసేన సభ్యత్వం తీసుకున్న వారికి రూ.5 లక్షలు ప్రమాద బీమా జీవిత సౌకర్యం, ప్రమాద బీమా రూ.50 వేలు కల్పిస్తున్నామని అన్నారు. మరింత సమాచారం కోసం 7386002002 నంబర్‌ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో జనసేన మండల నాయకులు ధరణి చంద్రమోహన్, మహమ్మద్ రఫి, కార్యకర్తలు సురేష్‌బాబు, సుధాకర్‌రెడ్డి, రవిచంద్ర, నాగేశ్వర్‌రెడ్డి, మహేష్, ఫరూక్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం విద్యార్థులకు చేయూత



విద్యార్థినికి చెక్కు అందజేస్తున్న ఖుద్దూస్

నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 4: గత విద్యా సంవత్సరంలో పదో తరగతిలో ఉత్తీర్ణులైన 370 మంది ముస్లిం విద్యార్థులకు నగదు పురస్కార చెక్కులను అంజుమన్ సంస్థ పంపిణీ చేసింది. ఆదివారం అంజుమన్ సంస్థ ఆధ్వర్యంలో సంస్థ అధ్యక్షుడు అబ్దుల్ ఖుద్దూస్ విద్యార్థులకు రూ.11 లక్షల చెక్కులను అందజేశారు. నంద్యాలలోని ముస్లిం మైనారిటీ పేద విద్యార్థులు నీట్ ద్వారా వైద్య సీట్‌ను సాధిస్తే వారికి అంజుమన్ సంస్థ ఫీజులు కట్టేందుకు సిద్ధంగా ఉందని ప్రకటించారు. ముస్లిం అమ్మాయిల వివాహాలకు రూ.50 వేలు ఇస్తున్నట్లు తెలిపారు. ఇమాముల సంఘం అధ్యక్షుడు హఫీజ్ అమ్జాద్‌బాషా సిద్దికి, జమాతే ఇస్లామి అధ్యక్షుడు అబ్దుల్ సమ్మద్ అంజుమన్ ఉపాధ్యక్షుడు అబ్దుల్‌హక్, గౌస్, మోహిద్దీన్, తదిరతులు పాల్గొన్నారు.

అలరించిన పాటల పోటీలు

నంద్యాల (కల్చరల్), ఆగస్టు 4: కళారాధన, నంద్యాల సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్, ఐఎంఏ సంయుక్త నిర్వహణలో దేశ స్వాతంత్ర్య వేడుకలను పురస్కరించుకొని పోటీలు నిర్వహించారు. ఆదివారం వివేకానంద ఆడిటోరియంలో సీనియర్స్ విభాగంలో శాస్త్రీయ, జానపద, సాధారణ, దేశభక్తి విభాగాల్లో సోలో, బృందగాన పాటల పోటీలు నిర్వహించారు. దేశభక్తి పాటలు, చక్కటి గానాలాప నలతో శాస్త్రీయ పాటలు, పల్లె జీవితాలకు అద్దం పట్టేజానపద పాటలు విశేషంగా అలరించాయి. వాద్య సంగీతంలో విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. న్యాయ నిర్ణేతలుగా సీతమ్మ, కళ్యాణి వ్యవహరించారు. శ్రీనివాసరెడ్డి, శేషఫణి, మజీద్, హర్షదీప్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నిజాముద్దీన్ పోటీలను పర్యవేక్షించారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

మెరుగైన వైద్య సేవలు అందించండి

జూనియర్ సివిల్ న్యాయాధికారి అబ్దుల్ రహిమాన్



సమావేశంలో మాట్లాడుతున్న అబ్దుల్ రహిమాన్

సంజామల, ఆగస్టు 4: సమాజంలో అణగారిన వర్గానికి చెందిన యానాదులకు మెరుగైన వైద్య సేవలందించాలని కోవెలకుంట్ల జూనియర్ సివిల్ న్యాయాధికారి అబ్దుల్ రహిమాన్ అన్నారు. ఆదివారం గిద్దలూరు సమీపంలో చీమలతిప్పపై నివశిస్తున్న యానాదులకు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. హైకోర్టు ఉత్తర్వు మేరకు వైద్య శిబిరం ఏర్పాటైంది. ఈ సందర్భంగా యానాదులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం అబ్దుల్ రహిమాన్ మాట్లాడుతూ యానాదుల ఆరోగ పరిరక్షణకు పేరుసోముల పీహెచ్‌సీ వైద్యులు చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు చంద్రశేఖర్ రెడ్డి, సృజన, వినోద్, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తలకు అండగా ఉంటాం: బీసీ

బనగానపల్లె, ఆగస్టు 4: టీడీపీ కార్యకర్తలకు అండగా ఉంటామని బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి అన్నారు. తీవ్ర అనారోగ్యంతో చికిత్స పొందుతున్న ఖాజాను ఆదివారం ఆయన పరామర్శించి ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. సొంత నిధులతో అంబులెన్సును ఏర్పాటు చేయించి మెరుగైన చికిత్స కోసం నంద్యాల వైద్యశాలకు తరలించారు. అలాగే వైద్యం కోసం అయిన బిల్లులను కూడా చెల్లించారు. అలాగే పట్టణంలోని మంగళవారం పేటకు చెందిన టీడీపీ నాయకులు మహేష్ అనారోగ్యంతో కర్నూలు గౌరీగోపాల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా ఆయనను పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి పరామర్శించారు. మెరుగైన వైద్యసేవలు అందించాలని డాక్టర్లను కోరారు.

టీడీపీ నాయకుడి మృతికి నివాళి

శిరివెళ్ల, ఆగస్టు 4 : శిరివెళ్లలోని పసులపేటకు చెందిన సీనియర్ టీడీపీ నాయకుడు పసుల సుధాకర్ మృతికి మండల కన్వీనర్, మాజీ ఎంపీపీ కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి ఆదివారం నివాళి అర్పించారు. అనారోగ్యానికి గురైన సుధాకర్ మృతి చెందడంతో విచారం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి అన్ని విధాలా అండగా ఉంటామన్నారు. మాజీ జడ్పీటీసీ యామా గుర్రప్ప, సూరా రామ, పీపీ లింగమయ్య, బీసీ ఖాజా హుసేన్‌లు నివాళి అర్పించారు.

చిన్నారులకు యూనిఫాం పంపిణీ

బేతంచెర్ల, ఆగస్టు 4: బేతంచెర్ల పట్టణ శివారులోని నంద్యాల రహదారిలో ఉన్న అన్నపూర్ణ అనాథాశ్రమంలో ఉన్న చిన్నారులకు డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి కూతురు డోన్ టీడీపీ యువ నాయకురాలు కోట్ల చిత్రమ్మ విద్యార్థులకు పుస్తకాలను, యూనిఫామ్, నోటు పుస్తకాలను ఆదివారం పంపిణీ చేశారు. అనాథాశ్రమంలో ఉన్న 20 మంది చిన్నారులకు యూనిఫామ్‌తోపాటు పాఠ్యపుస్తకాలు స్టడీ మెటీరియల్ నోటు పుస్తకాలను ఆమె సొంత ఖర్చులతో చిన్నారులకు అందజేశారు.

ధర్నాను విజయవంతం చేయండి

అవుకు ఆగస్టు 4 : ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద నిర్వహిస్తున్న ధర్నాకు మాలలు భారీగా తరలి రావాలని జైభీమ్ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు ఆవుల దేవరత్నం ఆదివారం పిలుపునిచ్చారు. అవుకులో మాల మహానాడు నాయకులతో నిర్వహించిన సమావేశంలో దేవరత్నం మాట్లాడారు. ఈ నెల 1వ తేదీన సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందన్నారు. దీనికి వ్యతిరేకంగా ఈనెల 8, 9, 10 తేదీల్లో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర కన్వీనర్ ఆవుల సుధాకర్, కంబగిరి, వినయ్‌కుమార్, భాస్కర్, భూపాల్, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

కుల మతాలను రూపు మాపేదే భగవద్గీత

కొలిమిగుండ్ల, ఆగస్టు 4: సమాజంలో అసమానతలు తొలగించి, కులమతాలను రూపుమాపేదే త్రైత సిద్ధాంత భగవద్గీత జ్ఞానమని త్రైత సిద్ధాంత ఇందూ జ్ఞాన వేదిక తాడిపత్రి కమిటీ అధ్యక్షుడు బాలయ్య పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని పెట్నికోట గ్రామంలో కమిటీ సభ్యులు రామానంద, గంగాధర, చంద్రమోహన్, రామక్రిష్ణారెడ్డి తదితరులు భగవద్గీత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్థులకు త్రైతసిద్ధాంత భగద్గీత పుస్తకాలను అందించారు.

కాలభైరవుడికి పూజలు

కొలిమిగుండ్ల, ఆగస్టు 4 : మండల కేంద్రంలోని లక్ష్మీనృసింహ కొండపై వెలసిన కాలభైరవుడికి ఆదివారం, ఆషాఢ మాసం, అమవాస్య పురస్కరించుకొని విశేష పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు పేరం నందకిశోర్‌రెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో, ఆలయ ప్రధాన అర్చకులు మహేష్‌శర్మ స్వామి వారికి విశేష అభిషేకాలు, పూజలు, అర్చనలు నిర్వహించి, భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. స్థానిక చౌడేశ్వరీమాత ఆలయంలో బోనాలు సమర్పించి పూజలు చేశారు.

19వ గంగ బ్లాక్ చానెల్ ఉప కాల్వకు గండి



గండిపడి వృథాగా పోతున్న నీరు

రుద్రవరం, ఆగస్టు 4: మండలంలోని అప్పనపల్లె గ్రామం పైభాగంలో 19వ బ్లాక్ చానెల్ ఉప కాల్వకు గండి పడి నీరు వృథాగా పోతోందని రైతులు ఆదివారం తెలిపారు. ఇక్కడ ఎన్నిసార్లు మట్టితో ఈ గండి పూడ్చినా తిరిగి గండి పడుతోందన్నారు. సాగునీరు అందుతుందని ఆశతో ఉన్న రైతులకు నిరాశే మిగిలింది. డీఈ చంద్ర ఓబుల్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు. మరమ్మతులు చేయిస్తామని తెలిపారు. ఆయన వెంట ఏఈలు రవీంద్రనాథ్, స్వరాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో సంక్షేమ పాలన

డోన్(రూరల్), ఆగస్టు 4: రాష్ట్రంలో సంక్షేమ పాలన నడుస్తోందని డోన్ టీడీపీ పట్టణ యువ నాయకుడు హనుమంతరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ పింఛన్లను పెంచిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికే దక్కుతుందన్నారు. ఎన్నికల సమయంలో రూ.4వేలు పింఛన్ అమలు చేస్తామని ఇచ్చిన మాటను సీఎం చంద్రబాబు నాయుడు నిలబెట్టుకున్నారని కొనియాడారు. భవిష్యత్తులో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, తల్లికి వందనం, అన్న క్యాంటీన్ పథకాలను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

శ్రావణ మాసం ప్రారంభం

కొలిమిగుండ్ల, ఆగస్టు 4: శ్రావణ మాసం సోమవారం ఆరంభం కానుంది. హిందువులు అత్యంత పవిత్ర మాసంగా శ్రావణ మాసాన్ని భావించి, తమ వివాహాది శుభకార్యాలకు వేదికగా మార్చుకుంటారు. మహా విష్ణువు జన్మ నక్షత్రం శ్రవణం. ఆ పేరుతో వచ్చే మాసం కావడంతో మహాలక్ష్మికి ఎంతో ఇష్టమైన మాసంగా పేర్కొంటారు. ఈ మాసంలో లక్ష్మీదేవిని పూజిస్తే సిరి సంపదలు, అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని మహిళల నమ్మకం. వరలక్ష్మీ వ్రతాలు, మంగళగౌరీ నోములు అత్యంత పవిత్రతో నిర్వహిస్తారు. పెళ్లిళ్లు, గృహ ప్రవేశాలు, ఇలా అనేక శుభకార్యాలను అధికంగా ఈ మాసంలోనే జరుపుకుంటారు.

ఆటకు టాటా

క్రీడా మైదానాలు లేక

క్రీడలకు దూరమవుతున్న విద్యార్థులు

ప్యాపిలి, ఆగస్టు 4: మండలంలోని ఆ ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడా మైదానాలు కొరవడ్డాయి. దీంతో విద్యార్థులు ఆటలకు దూరం కావల్సి వస్తోంది. దశాబ్దాలుగా పరిస్థితులు ఇలాగే ఉన్నా అధికారుల పట్టించుకోకపోవడం విచారకరం. మండలంలోని చిన్నపూదిళ్ల, ప్యాపిలి బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో క్రీడా మైదానాలు కొరవడ్డాయి. ఆయా పాఠశాలల్లో 600 మందికి పైగా విద్యార్థులు ఉన్నారు. అయితే విద్యార్థులంతా క్రీడాలకు దూరంగా ఉన్నారు. ప్యాపిలి బాలుర ఉన్నత పాఠశాల క్రీడలకు పెట్టింది పేరు. గతంలో ఈ పాఠశాల విద్యార్థులు జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడల్లో పాల్గొని విజేతలుగా నిలిచారు. అయితే ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. దీంతో పాఠశాల పూర్వ విద్యార్థులు, క్రీడాకారులు తాము చదివిన బడికి ఈ దుస్థితి రావడం పట్ల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే వెంగళాంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు క్రీడా మైదానం ఉన్నా.. వ్యాయామ ఉపాధ్యాయులు లేరు. రెండు దశాబ్దాల క్రితం యూపీ పాఠశాల నుంచి హైస్కూల్‌గా స్థాయి పెంచినా ఇంతవరకు వ్యాయామ ఉపాధ్యాయుడి పోస్టు మంజూరు చేయకపోవడం విచారకరం. దీంతో ఆ పాఠశాల విద్యార్థులు కూడ క్రీడలకు దూరం కావల్సి వస్తుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాఠశాలల్లో క్రీడా మైదానాలను అభివృద్ధి చేయడంతో పాటు వ్యాయామ ఉపాధ్యాయుడి పోస్టును మంజూరు చేయాలని విద్యార్థులు, ప్రజలు కోరుతున్నారు.



ఆటలకు వీలు లేని ప్యాపిలి హైస్కూల్ క్రీడా మైదానం



గడ్డితో నిండిన చిన్నపూదిళ్ల గ్రౌండ్

ఘనంగా స్నేహితుల దినోత్సవం

బేతంచెర్ల, ఆగస్టు 4: పట్టణంలోని వాసవి క్లబ్ ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవాన్ని స్థానిక అమ్మవారిశాల ఆలయంలో ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్ పూర్వ అధ్యక్షుడు కందగడ్డల మోహన్‌రావు, సుబ్రహ్మణ్యం, రాజేంద్ర కుమార్‌లను సన్మానించారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ అధ్యక్షులు గుంతా వెంకటసుబ్బయ్య గుప్తా, కార్యదర్శి వెంకటరమణ, కోశాధికారి మధుసురేంద్ర, అనుముల సురేష్, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

చాగలమర్రి: మండలంలో యువతీ, యువకులు, విద్యార్థులు ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సాయి సేవా సంస్థ కార్యాలయంలో స్నేహితులంతా కలిసి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. స్నేహ బంధం జీవితంలో మరువలేనిదంటూ చేతులకు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌ను కట్టుకున్నారు. అనంతరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

రుద్రవరం: రుద్రవరంలో స్నేహితుల దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. 1993-94 పదో తరగతి మిత్రబృందం సభ్యుల ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవం సందర్భంగా మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. 1993-94 పదో తరగతి మిత్రబృందం సభ్యులతో పాటు స్థానిక యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంఈవో కోటయ్య మాట్లాడుతూ ఆపద సమయంలో రక్తం అనేది ఎంతో అవసరమని అన్నారు. ప్రమాదంలో ఉన్న వారికి రక్తం విలువ తెలుసని, రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని పిలుపునిచ్చారు. పది కేజీల కేక్ కట్ చేసి 1993-94 మిత్రబృందం సభ్యులు, స్థానిక ప్రజలతో సంబరాలు జరుపుకున్నారు. అనంతరం ఇన్‌చార్జి ఎంఈవో కోటయ్య, విశ్రాంతి ఉపాధ్యాయుడు సుబ్బరాయుడు, హెచ్‌ఎం సుబ్బరాయుడు, ఏపీఎన్జీవో జిల్లా కార్యదర్శి హుసేన్ వలి, రుద్రవరం వైద్యాధికారి శివమోహన్, ఫార్మసిస్ట్ మహేశ్వరి, ఉపాధ్యాయుడు సుదర్శన్‌లను సన్మానించారు. మిత్రబృందం సభ్యులతోపాటు యువకులు 30 మంది రక్తదానం చేశారు.



బేతంచెర్లలో ఒకే వేదికపై కలుసుకున్న పూర్వ విద్యార్థులు



చాగలమర్రిలో స్నేహితుల దినోత్సవంలో పాల్గొన్న యువకులు



రుద్రవరంలో స్నేహితుల దినోత్సవ సందర్భంగా కేక్ కట్ చేస్తున్న స్నేహితులు

ఘనంగా చౌడేశ్వరీ మాత జయంతి



చౌడేశ్వరీ మాతకు చీరె తెస్తున్న బీసీ ఇందిరమ్మ



చాగలమర్రి చౌడేశ్వరిదేవి ఆలయంలో పూజలు

బనగానపల్లె, ఆగస్టు 4: నందవరం చౌడేశ్వరీ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. బీసీ ఇందిరమ్మ చౌడేశ్వరీ అమ్మ వారికి చీరెను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి జన్మదినం సందర్భంగా ఆలయంలో ఆవరణలో రక్తదాన శిబిరం నిర్వహించారు. అంతకు ముందు బీసీ ఇందిరమ్మకు ఈవో కామేశ్వరీదేవి, ఆలయ అధికారులు స్వాగతం పలికారు.

చాగలమర్రి: చాగలమర్రిలోని చిన్నమకానం వీధిలో వెలసిన చౌడేశ్వరీ దేవి ఆలయంలో ఆదివారం చౌడేశ్వరీ దేవి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చౌడేశ్వరీ దేవికి జల, క్షీరాభిషేకాలు చేశారు. పండ్లు, కూరగాయలు, పూలతో అలంకరించి శాకంబరి అలం కారంలో కొలువుదీర్చారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని చౌడేశ్వరీ దేవికి సమర్పించారు. ప్రత్యేక పూజలు చేశారు. టీడీపీ నాయకులు, మహిళలు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రఘురామ్, దామోదర్, సుబ్బనర్సయ్య, టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి గుత్తి నరసింహులు, సత్యనారాయణ, ప్రదీప్, మహిళలు పాల్గొన్నారు.



బోనాలతో ఆలయానికి వెళ్తున్న మహిళలు

కొలిమిగుండ్ల: మండలంలోని కోటపాడు గ్రామంలో చౌడేశ్వరీ మాత జయంతి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఆషాఢ మాసం, ఆదివారం, అమవాస్యతోపాటు అమ్మవారి జయంతి కావడంతో భక్తులు పెద్ద ఎత్తున చౌడేశ్వరీ మాతకు సాంప్రదాయ బోనాల సమర్పణ, కుంకుమార్చనలు, విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. టీడీపీ నాయకులు మూల శివారెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, సీతారామిరెడ్డి, ప్రకాశ్‌రెడ్డి పూజలు చేశారు.

ఆళ్లగడ్డ: ఆళ్లగడ్డ పట్టణంలో పాలసాగరం, పడకండ్ల అహోబిలం రోడ్డులో గల చౌడేశ్వరి దేవి అమ్మవారి దేవాలయాల్లో ఆదివారం అమ్మవారి జన్మదిన వేడుకలను నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. అనంతరం మహిళలు కేక్ కట్ చేశారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. పాలసాగరం రోడ్డులోని అమ్మవారి దేవాలయంలో కోలాటం నిర్వహించారు.

ఉమ్రా యాత్రకు ముస్లింలు

ఆళ్లగడ్డ, ఆగస్టు 4: ఆళ్లగడ్డ పట్టణం నుంచి ఉమ్రా యాత్రకు ముస్లింలు ఆదివారం బయలుదేరారు. సుమారు 20 మందికి పైగా బయలుదేరి వెళ్లారు. వీరికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారాలు అందించినట్లు పట్టణ కౌన్సిలర్ హుసేన్‌బాషా తెలిపారు.



పుట్టాలమ్మకు పూజలు

ఆళ్లగడ్డ, ఆగస్టు 4: ఆళ్లగడ్డ మండలంలోని ఆర్.క్రిష్ణాపురంలో వెలసిన రామతీర్థం పుట్టాలమ్మకు ఆదివారం భక్తులు పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చి కానుకలు, ముడుపులు చెల్లించుకున్నారు. భక్తులకు వేదపండితులు అన్నదానం చేశారు.

ముత్తలూరులోని లింగమయ్యకు..

రుద్రవరం, ఆగస్టు 4 : మండలంలోని ముత్తలూరు గ్రామ సమీపంలో కొలువుదీరిన లింగమయ్యస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామికి నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని కొండమాయపల్లె, రుద్రవరం, పెద్దకంబలూరు, చిన్నకంబలూరు గ్రామాల్లో ఆదివారం గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. మారెమ్మ, పెద్దమ్మ, సుంకులమ్మ అమ్మవార్లకు పూజిస్తే పాడిపంట చల్లగా ఉంటుందని మహిళా భక్తులు నమ్మకం వ్యక్తం చేశారు.

టీడీపీతోనే సామాజిక న్యాయం

● డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి



కోట్లను కలిసిన సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు

డోన్, ఆగస్టు 4: టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబుతోనే సామాజిక న్యాయం సాధ్యమని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని కోట్ల నివాసంలో ఎమ్మెల్యేను సీపీఐ ఎంఎల్ డెమోక్రసి పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు రంగనాయకులు, మండల కార్యదర్శి బందన, పట్టణ అధ్యక్షుడు చందు తదితరులు కలిసి అభినందనలు తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పును రాష్ట్రంలో త్వరగా అమలు చేసేలా చూడాలని కోట్లను వారు కోరారు. ఈ సందర్భంగా కోట్ల మాట్లాడుతూ సుదీర్ఘ పోరాటంతో మాదిగలు తమ హక్కును సాధించుకున్నారని అన్నారు. గతంలో సీఎంగా ఉన్న చంద్రబాబు ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలిపి అసెంబ్లీలో తీర్మానం చేసి తొలి అడుగు వేశారన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన ఎస్సీ వర్గీకరణతో అణగారిన వర్గాలకు ఆర్థిక చేయూత లభిస్తుందన్నారు.

సమాజ సేవతో సంతృప్తి



ద్రోణాచలం సేవా సమితి అధ్యక్షుడు రాజాకు సన్మానం

డోన్, ఆగస్టు 4: సమాజానికి సేవ చేయడంలోనే సంతృప్తి ఉంటుందని ద్రోణాచలం సేవా సమితి అధ్యక్షుడు రాజా అన్నారు. ఆదివారం శ్రీకాళహస్తిలో యువతరం సేవా సమితి 10వ వార్షికోత్సవం సందర్భంగా ద్రోణాచలం సేవా సమితి అధ్యక్షుడు రాజాను సన్మానించారు. డోన్ ప్రాంతంలో సేవా సమితి సభ్యులు చేస్తున్న సేవలు అనాథలు, పేదలు, వృద్ధులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని యువతరం సంస్థ ప్రతినిధులు కొనియాడారు. ద్రోణాచలం సేవాసమితిని స్ఫూర్తిగా తీసుకుని యువత సమాజ సేవలో భాగస్వాములు కావాలని కోరారు.

రైల్వే అండర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలి



మర్రి గోవిందరాజులుకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

డోన్(రూరల్), ఆగస్టు 4: పట్టణంలోని రెండు రైల్వేగేట్ల కింద రైల్వే అండర్ బ్రిడ్జిని ఏర్పాటు చేయాలని సమగ్ర వినియోగదారుల సంక్షేమ సంస్థ అధ్యక్షులు సాదనగిరి రామకృష్ణారెడ్డి, జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు ఏఈ నాగరాజు కోరారు. ఈ మేరకు ఏపీ పరిశ్రమల మాజీ డైరెక్టర్ మర్రి గోవిందరాజులును కలిసి వినతి పత్రం అందజేశారు. రైల్వే అండర్ బ్రిడ్జి లేకపోవడం వల్ల పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త మహమ్మద్ రఫీ తదితరులు ఉన్నారు.

దేశభక్తిని పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు కేఎస్ భానుసింగ్

డోన్(రూరల్), ఆగస్టు 4: దేశభక్తి భావాన్ని పెంపొందించుకోవాలని పెన్షనర్ల సంఘం అధ్యక్షులు కేఎస్ భానుసింగ్ అన్నారు. ఆదివారం పెన్షనర్ల సంఘం కార్యాలయంలో సంఘం సభ్యుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కేఎస్ భానుసింగ్ మాట్లాడుతూ ఆగస్టు 15 స్వాతంత్ర దినోత్సవాన్ని పెన్షనర్ల సంఘం కార్యాలయంలో ఘనంగా నిర్వహిస్తున్నటు తెలిపారు. పెన్షనర్లు తప్పనిసరిగా పాల్గొనాలన్నారు.

షడ్రక్‌కు ఘన నివాళి



షడ్రక్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

డోన్(రూరల్), ఆగస్టు 4: పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో సీనియర్ నాయకుడు షడ్రక్ చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. సీపీఎం సీనియర్ నాయకులు నాలుగో వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీకి ఆయన అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కొండయ్య, సీపీఎం పట్టణ, మండల కార్యదర్శులు కోయలకుండ నాగరాజు, నక్కి శ్రీకాంత్, అనుబంధ సంఘాల నాయకులు శివరాం, చిన్న రెహిమాన్, రామాంజనేయులు, నాగమద్దయ్య పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమావేశం

కోవెలకుంట్ల, ఆగస్టు 4: అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం సందర్భంగా పూర్వ విద్యార్థులంతా ఒక చోట చేరారు. కోవెలకుంట్ల పట్టణంలోని పురాతనమైన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1982-84 ఇంటర్ జూనియర్ కాలేజీలో చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఫ్రెండ్షిప్ డే సందర్భంగా కోవెలకుంట్ల పట్టణంలోని ముక్కెరఫంక్షన్ హాలులో జరిగింది. పట్టణానికి చెందిన గుద్దేటి చంద్రశేఖరరెడ్డి, లహరి, నాగేశ్వర్‌రావు, మగ్బుల్, సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఉద్యోగ, వ్యాపారాల్లో ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా ఒకే చోట చేరి ఆనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు.



ఫ్రెండ్ షిప్ డే సందర్భంగా ఒక చోట చేరిన పూర్వ విద్యార్థులు